

విశాల్ జనసభకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



మెదక్ అభివృద్ధికి కాంగ్రెస్సే అడ్డు

సిద్దిపేట-మనోహరాబాద్ రైల్వేలైన్‌కు స్థలమివ్వని రాష్ట్ర ప్రభుత్వం

ఇదీ రేవంత్‌కు ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమ..

సంగారెడ్డి-అకోలా, మెదక్-భైంసా హైవేలు వేసింది మేమే

జాతీయ రహదారితో అందోలు, నారాయణఖేడ్, జుక్కల్ సెగ్మెంట్లకు మహర్దశ

'అమృత్ స్టేషన్'గా జహీరాబాద్ రైల్వేస్టేషన్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

జోగిపేట, ఏప్రిల్ 30: ఉమ్మడి మెదక్ జిల్లాను ఎంతగా అభివృద్ధి చేయాలని తాము ప్రయత్నించినా.. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మోకాలడ్డుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అందోలు సెగ్మెంట్ పరిధిలోని అల్లాదుర్గం మండలం చిల్వర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన బీజేపీ ప్రచార (విశాల్ జన) సభలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉండడంతోనే సంగారెడ్డి-అకోలా హైవేను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. దీంతో రహదారి సౌకర్యం మెరుగుపడి సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్, జుక్కల్ సెగ్మెంట్లు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పూర్తిచేసిన హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారికి అనుసంధానంగా మెదక్-ఎల్లారెడ్డి-బోధన్-భైంసా రోడ్డును కూడా జాతీయ రహదారిగా గుర్తించి విస్తరిస్తున్నామని తెలియజేశారు. ఈ రోడ్డు అభివృద్ధితో మెదక్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌ను అమృత్ రైల్వే స్టేషన్‌గా గుర్తించి తీర్చిదిద్దామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ మాత్రం సహకరించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అందుకే ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసే పనులను రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు అడ్డుకుంటున్నదని మోదీ మండిపడ్డారు. మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు. రైల్వేస్టేషన్లకు స్థలం ఇవ్వడం లేదన్నారు. అలాగే, పొరుగున ఉమ్మడి వరంగల్ జిల్లాలో వనదేవతలైన సమ్మక్క-సారక్కల పేరిట గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నా రేవంత్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడం లేదని ప్రధాని ఆరోపించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీపాటిల్, మెదక్‌లో పోటీ చేస్తున్న రఘునందన్ రావులను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు బీబీ పాటిల్, రఘునందన్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు ప్రభాత్, జగదీశ్వర్, గంగా జోగినాథ్, రవిశంకర్, గాజుల నవీన్, సత్యం, జగన్నాథం, పులుగు గోపి, గాజుల అనిల్, ఉల్వల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



జోర్దార్‌గా బీజేపీ సభ

- జనసంద్రంగా మారిన అల్లాదుర్గం
- బీజేపీ శ్రేణుల్లో జోష్

జోగిపేట, ఏప్రిల్ 30: అందోలు సెగ్మెంట్ పరిధిలోని అల్లాదుర్గం మండలం చిల్వర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన విశాల్ జనసభ బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరైన ఈసభకు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4:53 నిమిషాలకు చిల్వెర చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు నిమిషాల్లో వేదిక పైకి చేరుకున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోతను కూడా లెక్క చేయకుండా వేలాదిగా జనం తరలిరావడంతో మోదీ సంతోషం వ్యక్తం చేశారు. వేదికపై ప్రధానిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మోదీ ప్రసంగించేందుకు సిద్ధమవడంతో మోదీ.. మోదీ.. అంటూ నినాదాలతో సభ దద్దరిల్లింది. మోదీ ప్రసంగాన్ని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలుగులోకి అనువదించారు. 45 నిమిషాలు కొనసాగిన ప్రధానమంత్రి ప్రసంగానికి అడుగడుగున జనం హర్షధ్వానాలు, జైశ్రీరాం.. జై మోదీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

కాషాయమయం

మోదీ సభ కోసం బీజేపీ చేపట్టిన జనసమీకరణతో హైవే మొత్తం కాషాయమయమైంది. బొడ్మట్‌పల్లి నుంచి అల్లాదుర్గం వరకు సుమారు ఆరు కిలోమీటర్లమేర ట్రాఫిక్‌జాం ఏర్పడింది. అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ సెగ్మెంట్లతో పాటు మెదక్ నియోజకవర్గ పరిధిలోని మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ల నుంచి భారీగా జనాలను తరలించారు. బీజేపీ సభలకు అందోలు నియోజకవర్గంలో ఎప్పుడూ రానంత జనాలు ఈసారి రావడంతో జహీరాబాద్ అభ్యర్థి బీబీపాటిల్, మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు, సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.



అభ్యర్థులతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

సంగారెడ్డి 5వ స్థానం

97.86 ఉత్తీర్ణత శాతం నమోదు

- బాలికలు 98.27 శాతం.. బాలురు 97.45 శాతం
- గతేడాదితో పోలిస్తే దిగజారిన రెండు స్థానాలు
- పర్యవేక్షణ లేక పడిపోయిన ఫలితాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. మార్చి 18 నుంచి 30 వరకు నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను మంగళవారం నాడు రాష్ట్ర విద్యాశాఖ సెక్రెటరీ బుర్ర వెంకటేశం విడుదల చేశారు. ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా గత రెండు పర్యాయాలు మూడో స్థానంలో నిలువగా ఈసారి రెండు స్థానాలు దిగజారింది. 2021-2022 సంవత్సరంలో 96.75 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలువగా, 2022-2023 సంవత్సరంలోనూ 97.29 శాతంతో అదే స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈఏడాది 97.86 శాతం ఉత్తీర్ణత సాధించినా ఐదో స్థానానికి పరిమితం కావడం నిరాశ పర్చింది.

బాలికలదే పైచేయి

ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో 22,012 మంది పరీక్షలు రాయగా, 21,540 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 97.45 శాతం ఉత్తీర్ణత కాగా, బాలికలు 98.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు.

296 పాఠశాలలో 100 శాతం

జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో 460 పాఠశాలలుండగా 296 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 435 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలు 197 ఉండగా.. 123 పాఠశాలల్లో వంద శాతం పాసయ్యారు. ఇందులో 19 మందికి 10/10 జీపీఏ వచ్చింది. జిల్లాలో ఉన్న పది మోడల్ స్కూళ్లలో 8 వంద శాతం రిజల్ట్ సాధించాయి. ఎనిమిది మందికి 10/10 జీపీఏ వచ్చింది. 17 కేజీబీవీల్లో 12 వాటిలో 100 శాతం పాసవగా.. ఒకరు 10/10 జీపీఏ సాధించారు. రెండు ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి వంద శాతం రిజల్ట్ సాధించింది. ఇద్దరికి 10/10 జీపీఏ వచ్చింది. టీఎస్ రెసిడెన్షియల్ స్కూళ్ల రెండింటిలో ఒక స్కూల్ వంద శాతం రిజల్ట్ సొంతం చేసుకోగా, ముగ్గురికి 10/10 జీపీఏ వచ్చింది. సోషల్ వెల్ఫేర్ 11 పాఠశాలల్లో 10 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, ఇందులో 10 మందికి 10/10 జీపీఏ వచ్చింది. ఆరు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో వంద శాతం రిజల్ట్ నమోదవగా.. ఏడుగురికి 10/10 జీపీఏ వచ్చింది. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలు రెండింటికి ఒకదాంట్లో పాఠశాల వంద శాతం రిజల్ట్ నమోదైంది. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు 12కు ఎనిమిది స్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత, 11 మంది 10/10 జీపీఏ సాధించారు. బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు 11 ఉండగా, ఇందులో 10 పాఠశాలలు వంద శాతం రిజల్ట్ నమోదుకాగా, 31 మంది 10/10 జీపీఏ సాధించారు. ప్రైవేటు స్కూళ్లు 179 ఉండగా అందులో 116 స్కూళ్లలో వంద శాతం రిజల్ట్ నమోదుకాగా, 339 మందికి 10/10 జీపీఏ వచ్చింది. జిల్లాలో 28 మండలాలుండగా, నాలుగు మాత్రమే 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

పర్యవేక్షణ లోపమే శాపం

పదో తరగతి ఫలితాల్లో జిల్లా గతం కంటే రెండు స్థానాలు దిగజారి 5వ స్థానంలో నిలవడం కొంత నిరాశకు గురిచేసింది. ఈసారి స్థానం మెరుగుపడుతుందని భావించిన విద్యాశాఖ అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. జిల్లా ర్యాంకు దిగజారడానికి అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం ఉందని విద్యాశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పదో తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించినప్పటికీ వారు సరిగ్గా పనిచేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందనే వాదనలు ఉన్నాయి.

రీ-కౌంటింగ్‌కు 15 వరకు గడువు

ఫలితాలపై రీ-కౌంటింగ్ కోరే విద్యార్థులు ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500 చొప్పున హెడ్ ఆఫ్ అకౌంట్స్‌లో చలానా చెల్లించి నేరుగా లేదా రిజిస్టర్‌పోస్టు ద్వారా హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రీ-వెరిఫికేషన్ కోరే విద్యార్థులు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సూచించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 3వ తేదీ నుంచి 13 వరకు నిర్వహిస్తామని డీఈవో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈవో

పదవ తరగతి ఫలితాల్లో జిల్లాకు 5 వ స్థానం వచ్చినందుకుగాను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని డీఈవో వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా మెరుగైన స్థానం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజి, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తదితరులు ఉన్నారు.

పదో తరగతి ఫలితాలు

మెదక్ 18వ స్థానం

92.90 శాతం ఉత్తీర్ణత

- బాలికలు 94.82 శాతం
- బాలురు 90.92 శాతం
- గతేడాది కంటే ఐదు స్థానాలు తక్కువ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో మెదక్ జిల్లా రాష్ట్రస్థాయిలో 18వ స్థానంతో సరిపెట్టుకుంది. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగినా రాష్ట్రస్థాయిలో ర్యాంకు దిగజారింది. మంగళవారం వెల్లడైన ఫలితాల్లో 92.90 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 90.84 శాతం ఉత్తీర్ణతతో 13వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈసారి ఐదు స్థానాలు దిగజారింది. ఫలితాల్లో మరోసారి అమ్మాయిలు సత్తాచాటారు. ప్రైవేట్ స్కూల్స్ మెరుగైన ఫలితాలు సాధించగా.. ప్రభుత్వ బడుల్లో ఉత్తీర్ణత శాతం పడిపోయింది. జిల్లావ్యాప్తంగా 10,283 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాశారు. ఇందులో 9,553 మంది పాసయ్యారు. వీరిలో బాలురు 4,608 (90.92 శాతం) మంది, బాలికలు 4,945 (94.82 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 225 పాఠశాలుండగా.. 86 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలాలవారీగా మెదక్ 11 పాఠశాలలు, చేగుంట 10, రామాయంపేట 8, నిజాంపేట 8, తూప్రాన్ 6, అల్లాదుర్గం 6 నర్సాపూర్ 5, చిలప్‌చెడ్ 5, కౌడిపల్లి 4, కొల్చారం 4, పాపన్నపేట 4, వెల్దుర్తి 3, శివ్వంపేట 3, పెద్దశంకరంపేట 2, రేగోడ్ 2, హావేళీఘణపూర్, నార్సింగి, మాసాయిపేట, టేక్మాల్, మనోహరాబాద్ మండలంలో ఒకటి చొప్పున పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.



రామచంద్రాపురం: వెలిమెల మోడల్ స్కూల్‌లో టెన్త్‌క్లాస్ టాపర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

మెదక్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గుర్తులు కేటాయించారు. మంగళవారం 4 ప్రధాన పార్టీలతో పాటు 40 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. మెదక్ లోక్‌సభ పరిధిలో మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో 16 గుర్తులకే అవకాశం ఉంటుంది. ఇందులో 15 మంది అభ్యర్థులు, ఒకటి నోటాకు కేటాయిస్తారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో ఒక బ్యాలెట్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 44 మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో పోలింగ్ రోజు మూడు ఈవీఎం యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

తమకు కేటాయించిన గుర్తులను పోలిన గుర్తులను ఇవ్వొద్దని పలు పార్టీలు ఈసీని కోరుతున్నాయి. మరోపక్క తమ పార్టీ గుర్తు లాంటి ఇతర గుర్తులను వేరే ఎవరికైనా కేటాయిస్తే తమకు పడే ఓట్లు వారికి పడి ఫలితాలు తారుమారు అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేస్తున్న యుగ తులసి ఫౌండేషన్ గుర్తు రోడ్డు రోలర్. ఇది తమ పార్టీ గుర్తు కారును పోలి ఉంటుందని గతంలో బీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ గుర్తును రద్దు చేయాలని బీఆర్ఎస్ సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. అయితే ఆ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది.

సంగారెడ్డిలో నీటి సరఫరాకు డోకా లేదు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై మున్సిపల్ కమిషనర్ స్పందన

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 30: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సరఫరాకు డోకా లేదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 'సంగారెడ్డికి నీటి గోస' అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. సంగారెడ్డి పట్టణంలో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. పట్టణానికి ఏప్రిల్ 28న సింగూరు నుంచి మంజీరా రిజర్వాయర్‌కు 0.30 టీఎంసీల నీటిని విడుదల చేశారని తెలిపారు. సింగూరు నుంచి మంజీరాకు నీటిని విడుదల చేయడం వల్ల పట్టణంలో భవిష్యత్‌లో ఎలాంటి నీటి సమస్య తలెత్తదన్నారు. అయితే, ఏప్రిల్ 28న సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసినట్లు వివరించిన కమిషనర్.. 29న సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా ఎందుకు నిలిచిపోయిందో పేర్కొనకపోవడం గమనార్హం.

తాగు నీటి సమస్య లేకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి, ఏప్రిల్ 30: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వెల్దుర్తి ఎంపీపీ స్వరూప సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికార సరఫరాను పరిశీలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మికి సూచించారు. మండలంలో 23 అమ్మ ఆదర్శ పాఠశాలలు మంజూరయ్యాయని, పాఠశాలలో మౌలిక వసతులకు, మరమ్మతులకు రూ.86లక్షల 50వేలు మంజూరైనట్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్ నవీన్ తెలిపారు. విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఏఈ వెంకటేశ్వర్లు చెప్పారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో 4వేల మంది కూలీలు పనిచేస్తున్నారని ఏపీవో రాజు తెలిపారు. కుకునూర్ గ్రామ ప్రత్యేక అధికారి రాజేందర్ గ్రామానికి రావడం లేదని, గ్రామంలో నీటి సమస్య ఉందని జడ్పీటీసీ రమేష్‌గౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో జగదీశ్వరచారి అన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీవో విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.

గొల్పర్తిలో యువకుడి అదృశ్యం



రామాయంపేట, ఏప్రిల్ 30: రామాయంపేట మున్సిపల్ పరిధి గొల్పర్తి ప్రాంతానికి చెందిన కుమ్మరి రాజ్‌కుమార్ అదృశ్యమయ్యాడు. ఏప్రిల్ 20న ఇంటి నుంచి వెళ్లిన రాజ్‌కుమార్ తిరిగిరాలేదు. కుటుంబీకులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా జాడ దొరకలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ న్యాయవాదిని అభినందించిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 30: హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేలా కోర్టులో వాదనలు వినిపించిన అదనపు ప్రభుత్వ న్యాయవాది విజయశంకర్‌రెడ్డిని, కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ మంగళవారం అభినందించారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడినందుకు న్యాయవాదిని అభినందించారు.

ఏం మొహం పెట్టుకుని సిద్దిపేటకు వస్తావు?

● ఓట్లు అడిగే నైతికత రేవంత్‌రెడ్డికి లేదు
● సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న రఘునందన్‌రావు
● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 30: సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తీసుకుపోయి, నోటికాడి బుక్క లాక్కున్న సీఎం రేవంత్‌రెడ్డి ఏం మొహం పెట్టుకుని సిద్దిపేటకు వచ్చి ఓట్లు అడుగుతారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఆటో క్రెడిట్ యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆటో కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు హరించివేశారని, అదాని, అంబానీలకు దోచి పెట్టి, దేశంలో ఏ వర్గానికి కూడా న్యాయం చేయని కార్మికుల వ్యతిరేక పార్టీగా బీజేపీపై ముద్ర పడిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వందరోజుల్లో అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రామిసరీ నోట్‌లు, పార్లమెంట్ ఎన్నికల్లో గాడ్ ప్రామీస్‌లు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు మళ్లీ ఓటేస్తే వారి హామీలను ప్రజలు ఆమోదించనట్లు అవుతుందని చెప్పారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయిస్తామన్నారు. రాష్ట్రంలో ఆటో కార్మికుల జీవితాలు కాంగ్రెస్ పాలనలో రోడ్డున పడ్డాయన్నారు. ఆటో కార్మికులు చనిపోతే రేవంత్‌రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని, కనీసం వారి కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతతో


సిద్దిపేటలో నిర్వహించిన ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

విద్యుత్ సరఫరా చేయలేక ఉద్యోగస్తులను బాధ్యులను చేస్తూ వారికి షోకాజ్ నోటీసులు, బదిలీలు, సస్పెండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న రఘునందన్‌రావు ఈ ప్రాంత ఓట్లు ఎలా అడుగుతావని ప్రశ్నించారు. సిద్దిపేట అంటేనే బీఆర్ఎస్ గడ్డని హరీశ్‌రావు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పాల సాయిరాం, శ్రీనివాస్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్, రాయపోల్, దౌల్తాబాద్‌లో రోడ్ షో

జగదేవ్‌పూర్/రాయపోల్/దౌల్తాబాద్: జగదేవ్‌పూర్, రాయపోల్‌లో నిర్వహించిన రోడ్ షోలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకో పార్టీ మారే గద్దలను రేవంత్‌రెడ్డి ఎత్తుకెళ్లి, కాంగ్రెస్ టికెట్లు ఇచ్చారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. విభజన సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి ఓట్లేస్తే గుంపు మేస్త్రీ అయిన రేవంత్‌రెడ్డి గువ్వ పలగాలని చెప్పారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి నీరుగారిచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కేసీఆర్ జిల్లాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల పేరుతో జిల్లాలను తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, యాదగిరి, మంగమ్మరామచంద్రం, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వరశర్మ, ఎంపీపీ పాండుగౌడ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

హవేళీఘణపూర్, ఏప్రిల్ 30: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలంలోని తిమ్మాయిపల్లిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాయిపల్లికి చెందిన తలారి అజయ్(23) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న గుడిసెలో తాడుతో ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టు నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య రమ్య, తల్లిదండ్రులున్నారు. ఎవరో తన భర్తను ఉరి వేసి చంపారని మృతుడి భార్య ఆరోపిస్తుంది. తగు విధంగా విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

కారు, బైకు ఢీకొని వ్యక్తి..

చిలప్‌చెడ్: ఎదురెదురుగా వస్తున్న కారు, బైకు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం(45) ఫుల్కల్ గ్రామానికి బీరప్ప పండుగకని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో మెదక్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో మల్లేశం ఎగిరి పంట పొలాల్లో పడ్డాడు. తలకు తీవ్ర గాయమవడంతో 108 అంబులెన్స్ వాహనంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మల్లేశం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరు కారును వదిలేసి, పరారయ్యాడని, కారును స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఏఎస్ఐ మిస్బావుద్దీన్ తెలిపారు. కాగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వైరల్ ఫీవర్ పట్ల జాగ్రత్తలు పాటించాలి

● ఫైలేరియా జిల్లా అధికారి విజేందర్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 30: వైరల్ ఫీవర్ పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఫైలేరియా మెదక్ జిల్లా అధికారి విజేందర్ సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైద్యులు గ్రామంలో మంగళవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. కాళ్లు, నడుము, ఒల్లు నొప్పులు, కళ్లు తిరుగడంతో పాటు జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. గ్రామస్థులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వైద్యాధికారి సాయిసింధు ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేశారు. రోగుల రక్త నమూనాలు సేకరించి, పరీక్షలను నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ఫైలేరియా జిల్లా అధికారి విజేందర్ గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టిలు, కులాయిలు శుభ్రం చేయాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగాలని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ హారికవ వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి

నర్సాపూర్, ఏప్రిల్ 30: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేసి, కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, మంతూరు, కాజీపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు పీడీ సందర్శించారు. అక్కడ ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. సిబ్బంది సకాలంలో ట్యాబ్ ఎంట్రీ చేస్తూ రైతులకు డబ్బులు త్వరితగతిన వారి ఖాతాలో పడేటట్టు చూడాలని సూచించారు. ఆమె వెంట ఏపీఎం గౌరిశంకర్, సీసీ ప్రవీణ, సీఏలు మహేశ్వరీ, జ్యోతి, స్వప్న తదితరులు ఉన్నారు.


మంతూరు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు పీడీ సరస్వతి

మే డేను బహిష్కరించాలి

● బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: మే డేను బహిష్కరించి, విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినంగా ప్రకటించాలని బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మేడేను బహిష్కరించాలని కోరారు. స్వదేశ తిండి తింటూ విదేశీ పాట పాడే వారే మేడేను జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఉనికి కోసం రాజకీయాల అవసరాల కోసం విదేశీ సిద్ధాంతాలను కార్మిక వర్గంపై రుద్దాలని చూస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎంతో మంది మహోన్నతమైన వ్యక్తులున్నా వాళ్లకు కనిపించదని సకల మానవాళికి ఉపయోగపడేలా పనిముట్లను అందించిన విశ్వకర్మ ఆది దేవుడని అభివర్ణించారు. విశ్వకర్మ జయంతి సెప్టెంబరు 17న కార్మిక దినోత్సవం ప్రకటించే వరకు భారతీయ మజ్దూర్ సంఘ్ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

తెలంగాణలో అత్యధిక సీట్లు బీజేపీవే..

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, ఏప్రిల్ 30: ధర్మానికి, అధర్మానికి జరుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నిర్వహించిన బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మొత్తం మోదీ వైపు చూస్తున్నదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణాలోని 17 సీట్లు గెలిచేందుకు బీజేపీ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని, వీరి కృషి వల్లనే తాను ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించానని చెప్పారు. తప్పుడు వాగ్దానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిలో బీజేపీపై అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సంస్కార హీనంగా మాట్లాడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు బీబీపాటిల్, రఘునందన్‌రావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, గోదావరిఅంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, అరుణతార తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

● జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్


అల్లాదుర్గంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/టేక్మాల్, ఏప్రిల్ 30: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు ఓటు వేయాలని జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ కోరారు. మంగళవారం అల్లాదుర్గంలో నిర్వహించిన బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి చేశానన్నారు. దీనికి నిదర్శనమే 161వ జాతీయ రహదారి నిర్మాణం అని చెప్పారు. ప్రధాని మోదీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం నాణ్యమైన, వేగవంతమైన 5జీ నెట్‌వర్క్ అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నారాయణఖేడ్-బీదర్ రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని, పనుల కోసం సర్వే కూడా జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు గత ప్రభుత్వం కేవలం రూ.150 చెల్లిస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం రూ.300 చెల్లిస్తున్నదని చెప్పారు. రైతులను ఆదుకోవడానికి వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203 చెల్లించి మోదీ రైతు బాంధవుడయ్యారన్నారు. జహీరాబాద్ ఎంపీగా తనను మరోసారి గెలిపించాలని బీబీపాటిల్ కోరారు. తనను గెలిపిస్తే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు.

అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్

● కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు
● మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, ఏప్రిల్ 30: అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ అని, పార్టీకి 125 సంవత్సరాల చరిత్ర ఉన్నదని, కార్యకర్తలు లేనిది పార్టీ లేదని, పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ మండల కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడవకముందే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, మిగతావి కూడా ఎంపీ ఎన్నికలు అయిపోగానే అమలు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మండలంలో సుమారు రూ.400 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన గుర్తుచేశారు. బొగులంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించామని పేర్కొన్నారు. బుదేరా నుంచి సిరూర్ రోడ్డు నిర్మాణం కోసం రూ.80 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తమ కుటుంబం 62 ఏళ్ల నుంచి గెలిచినా, ఓడినా కాంగ్రెస్‌లోనే ఉంటూ కార్యకర్తలను కాపాడుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీనర్సింహులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

ప్రజలను మభ్యపెడుతున్న సీఎం

● ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి
● కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది చీకటి ఒప్పందం
● మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు


వర్గల్ మండలం నాచారంలో రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 30: సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మభ్యపెడుతున్నాడని మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామంలోని లక్ష్మీనర్సింహ క్షేత్రంలో పూజలు నిర్వహించి, ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాచారం పెద్ద చెరువులో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. మండలంలోని నాచారం, దండుపల్లి, మజీద్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందంతో బీజేపీ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి గతాన్ని మరిచి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెట్టారని, ప్రజలు నిలదీస్తుంటే బిక్కముఖం వేస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టనుందని ధీమా వ్యక్తం చేశారు. నూతన ఆర్థిక సంస్కరణలతో ప్రపంచ దేశాలు నరేంద్రమోదీని ప్రశంసిస్తుంటే ఇండియా కూటమి నేతలకు నచ్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీ సర్కార్ కట్టుబడి పనిచేస్తుండగా, రిజర్వేషన్ల రద్దు పేరుతో కాంగ్రెస్ ఆయా వర్గాలను రెచ్చగొడుతున్నదని మండిపడ్డారు. అమిత్‌షా అనని మాటలను అన్నట్లుగా చూపెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్ కుటుంబం జైలు పాలు కాక తప్పదన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుండగా కవిత అరెస్టును బీజేపీకి అంటగడుతున్నారని చెప్పారు. రఘునందన్‌రావు వెంట బీజేపీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీమా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన

కల్హేర్, ఏప్రిల్ 30: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని చాప్టా(కె), ఉజలంపాడ్ సీతారాంతండా గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీమా ఆంజనేయ, గణపతి, రుక్మిణి, పాండురంగ, దత్తాత్రేయ, శివనాగ నంది, సహిత శిఖర స్థిర యంత్ర ధ్వజ స్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంటపాల పూజ, మన్యుసూక్త రుద్ర, నవగ్రహ, ఆవాహిత హోమాలు, ధాన్యాధి వాసం, శయ్యాది వాసం, ఫలాధివాసం, పుష్పాదివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వారం రోజుల పాటు అఖండ హరి నామ సప్తాహ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, సాధ్వి భగీరథ బాయి, ఏకాంబ ఆనంద్ మహరాజ్, ధనాసిరి వీరేశ్వర శివాచారి హీరేమఠ్ పాల్గొంటారని తెలిపారు.

బాదల్‌గాంలో శివపార్వతుల కల్యాణం...


శివపార్వతుల కల్యాణం జరుపుతున్న దృశ్యం

మనూరు: మనూరు మండలం బాదలగాం గ్రామంలోని పంచలింగేశ్వరాలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిపారు. సద్గురు కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఇంటర్ విద్యార్థుల ఫీజు చెల్లింపునకు రేపటిదాకా గడువు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 2వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం కూడా ఈ నెల 2వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా ఆయా తేదీల్లో విద్యార్థులు ఫీజు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులపై కోపంతో కొండగట్టుకు ఆస్తి...

చిన్నకోడూరు, ఏప్రిల్ 30: తనను ఆదరించడం లేదని కుటుంబ సభ్యులపై కోపంతో తన పేరిట ఉన్న ఆస్తిని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి ఇవ్వాలనుకున్నాడు ఓ వ్యక్తి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కప్పెర బాపురెడ్డి కుటుంబ సభ్యులతో గొడవ పడి కొన్నేండ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బాపురెడ్డి తన పేరిట ఉన్న ఆస్తిని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల కొండగట్టుకు వెళ్లి ఆస్తి పత్రాలను హుండీలో వేస్తుండగా ఆలయ అధికారులు హుండీలో వేస్తే దేవునికి చెందవని చెప్పారు. దీంతో ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేస్తానని తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను బాపురెడ్డి కోరాడు.

తాగు నీటి కోసం మహిళల ధర్నా


చిన్నశంకరంపేటలో ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 30: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో తాగు నీళ్లు దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి తాగు నీరు లేకపోవడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం మహిళలు ఖాళీ బిందెలతో చేగుంట-మెదక్ రహదారిపై గంట పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ.. పైప్‌లైన్ నుంచి మంచినీటి సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పంచాయతీ ఈవో ప్రశాంత్‌కు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వాటర్ మన్ నిర్వాహకంతోనే నీటి సమస్య ఏర్పడుతున్నదని ఆరోపించారు. కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈవో ప్రశాంత్ మంచినీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసనను విరమించారు.

డ్రిప్‌తో వరి సాగు

● ఎకరాకు రూ.15 వేల ఖర్చు, నీటి ఆదా
● ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు కవిత

గుమ్మడిదల, ఏప్రిల్ 30: ఎండలకు భూగర్భ జలాలు అడుగంటుతుడడంతో బోర్ల నుంచి నీళ్లు రాక రబీ సీజన్‌లో వేసిన వరి పొలాలు ఎండుతున్నాయి. అయితే సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన అమ్మగారి కవిత అనే మహిళా డ్రిప్ ద్వారా వరిసాగు చేయడం మంచి ఫలితాలనిచ్చింది. కూరగాయలు సాగు చేసుకొనే పద్ధతిలోనే డ్రిప్ ద్వారా వేసవిలో వరి సాగు చేసి అధిక దిగుబడి సాధించింది. జనవరిలో తనకున్న ఎకరా పది గుంటల్లో డ్రిప్ సహకారంతో వరి సాగు చేసింది. సమయానికి డ్రిప్ ద్వారా వరికి నీటిని సరఫరా అందించి, అధిక దిగుబడి సాధించే దిశగా శ్రమించింది. నేడు వరి పంట పచ్చదనంతో కళకలాళాడుతుంది. నెల రోజుల్లో ఈ పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. అయితే డ్రిప్ ద్వారా సాగు చేసినందుకు ఎకరా పది గుంటల వరికి రూ.15 వేలు మాత్రమే ఖర్చు చేసినట్లు రైతు తెలిపారు. దుక్కి దున్నడం, నాట్లు వేయడం, కలుపు తీయడం వంటి పనుల భారం నుంచి ఉపసనం పొందినట్లు వివరించారు. సమయం ఆదాతో పాటు నీటి ఆదా కూడా లభిస్తుందని తెలిపారు. తాను సాగు చేసిన ఎకరా పది గుంటల వరి నుంచి రూ.90 వేలకు పైగా ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు కూడా నీటి ఆదా, తక్కువ ఖర్చుతో కూడిన డ్రిప్ ద్వారా వ్యవసాయ సాగుతో శ్రమ లేకుండా ఆదాయం పెంచుకోవాలని కవిత హితువు పలుకుతున్నారు.


గుమ్మడిదలలో డ్రిప్ ద్వారా సాగయిన వరి



పొలం వద్ద ఏర్పాటు చేసిన డ్రిప్ యంత్రం

పదో తరగతి పరీక్షాఫలితాల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడ్డారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు




మెదక్‌లో 10 జీపీఏ సాధించిన గీతా, సిద్ధార్థ విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో గీతా విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 27 మంది విద్యార్థులు 10/10 జీపీఏ గ్రేడ్ సాధించగా, 19 మంది 9.8, 24 మంది 9.7 గ్రేడ్ సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థులను పాఠశాల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ మాధవి అభినందించారు. కాగా మెదక్ సిద్ధార్థ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. 14 మంది విద్యార్థులు 10/10 జీపీఏ గ్రేడ్ సాధించగా, 16మంది 9.8, 39మంది 9.7 గ్రేడ్ సాధించారు. వారిని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి అభినందించారు.

● **నర్సాపూర్:** మండలంలోని మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 84.39శాతం సాధించారు. అందులోని నాలుగు పాఠశాలలైన రెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్, నర్సాపూర్ గిరిజన గురుకులం, మైనార్టీ గురుకులంతో పాటు బీసీ గురుకుల బాలికల విద్యాలయంలో వందశాతం ఉత్తీర్ణత నమోదైనట్టు మండల విద్యాధికారి బుచ్యానాయక్ వెల్లడించారు.

● **తూప్రాన్:** పట్టణంలోని గీతా స్కూల్ విద్యార్థులు ఏడుగురు 10 జీపీఏ, 15 మంది 9.8 జీపీఏ సాధించారు. వారిని కరస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, డైరక్టర్లు బి. రాఘవేందర్‌గౌడ్, కే. నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ అభినందించారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 88.7శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఎంఈవో బుచ్చానాయక్ తెలిపారు. తూప్రాన్ (టోల్‌ప్లాజా) గురుకుల బాలుర పాఠశాల, ఇస్లాంపూర్ హైస్కూల్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో 97.2శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

● **హవేళిఘణపూర్:** మండలంలో 371 మంది విద్యార్థులకు గాను 342 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో నీలకంఠం తెలిపారు. హవేళిఘణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష 9.8 సాధించింది. మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించగా, శ్రీవాని, శ్రీనిధి 10/10 జీపిఏ సాధించినట్టు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు.

● **చిన్నశంకరంపేట:** పది ఫలితాల్లో చిన్నశంకరంపేటలోని జడ్పీహెచ్ఎస్ 53 శాతం, చందంపేట జడ్పీహెచ్ఎస్ 62.5 శాతం, సూరారం జడ్పీహెచ్ఎస్ 62.8 శాతం, మిర్జాపల్లి 80. 77శాతం, మడూర్ 83 శాతం, ధర్పల్లి జడ్పీహెచ్ఎస్ 53 శాతం, చిన్నశంకరంపేట కేజీబీవీ 65 శాతం, ఆదర్శ పాఠశాల 99 శాతం, శాలిపేట ఎంపీహెచ్ఎస్ 58.82 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మోడల్ స్కూల్‌కు చెందిన సాత్విక 10 జీపీఏ సాధించారు.

● **రేగోడు:** పదోతరగతి ఫలితాల్లో రేగోడు మోడల్ పాఠశాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించగా, పుర్ర అభిలాష అనే విద్యార్థిని 9.8 జీపీఏ సాధించినట్టు ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు. రేగోడు కస్తూర్బా బాలికల విద్యాలయంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ స్వయంప్రభ తెలిపారు. జాగిర్యాల ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం రవీందర్ తెలిపారు.

● **పాపన్నపేట:** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 94.89 శాతం ఉత్తీర్ణత సాధించారు. కుర్తివాడ ఉన్నత పాఠశాలకు చెందిన వరలక్ష్మి 9.8 జీపీఏ సాధించారు. మండల పరిధిలోని కుర్తివాడ, గాంధారిపల్లి, కోడపాక, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● **మాసాయిపేట:** మండలంలోని పోతనపల్లి ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రామారావు తెలిపారు. మండలంలోని కొప్పులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు.

● **చేగుంట:** మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలలు పదోతరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండల పరిధిలోని కన్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదేళ్లుగా వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని చేగుంట, రెడ్డిపల్లి, బోనాల, ఆదర్శ పాఠశాల, ఎస్టీ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలోని బి.పావని 10 జీపీఏ, జి.అక్షిత 10 జీపీఏ సాధించారు. గిరిజన గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థిని పి. సరస్వతి, 10 జీపీఏ, సాధించారు.

● **రామాయంపేట:** పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐదుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు.

● **చిలప్‌చెడ్:** మండలంలోని 6 పాఠశాలలు, 1 కేజీబీవీకి చెందిన విద్యార్థులు పదోతరగతిలో 97.3 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన వి కీర్తిశ్రీ, సోమక్కపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఏ రాగిని 9.7జీపీఏతో మండలస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు. కాగా చండూరు, గౌతాపూర్, సోమక్కపేట, చిలప్‌చెడ్, కేజీబీవీ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

● **నర్సాపూర్:** నర్సాపూర్ డాన్‌బాస్కో హైస్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించగా ఇద్దరు విద్యార్థినులు 10/10 జీపీఏ సాధించారు.

● **కొల్చారం:** పదవ తరగతి ఫలితాల్లో కొల్చారం మండల విద్యార్థులు 96.78శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాధికారి నీలకంఠం తెలిపారు. రంగంపేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎరుకల నందిని 10/10 జీపీఏ సాధించింది.

● **మనోహరాబాద్:** మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలైన మనోహరాబాద్, రంగాయపల్లి, కాళ్లకల్, రామాయపల్లి, పర్కిబండ, ముప్పిరెడ్డిపల్లి, కూచారంతో పాటు ఒక కేజీబీవీ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● వెల్దుర్తి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వెల్దుర్తి, కుకునూర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. వెల్దుర్తి మండలంలో విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఏంఈవో యాదగిరి తెలిపారు.

● **అల్లాదుర్గం:** మండలంలోని ఐదు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ముస్లాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం. భానుప్రియ, పి.మధులిక 9.7 జీపీఏ సాధించారు.

● **పెద్దశంకరంపేట:** పదవతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో మొత్తం 90.4 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆదర్శపాఠశాల విద్యార్థిని సచిత్రాశ్రీ 9.8 జీపీఏ సాధించారు.

● **టేక్మాల్:** టేక్మాల్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆ పాఠశాలకు చెందిన స్పందన, అనూష, నందిని, ప్రణతి 9.8 జీపీఏ సాధించి ప్రతిభ కనబర్చారు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి సత్తా చాటారు. అలాగే 31 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 37 మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 30 మంది 9.5 జీపీఏ, 24 మంది 9.3 జీపీఏ, 29 మంది 9.2 జీపీఏ, 22 మంది 9.0 జీపీఏ సాధించారు. అంతే కాకుండా 195 మంది విద్యార్థులు 9.0 ఆ పై జీపీఏ సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఉత్తమ ఫలితాలు సాధించినవారిని విద్యాసంస్థల అధినేత ఈ.సోలోమోన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఈ.జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

● సంగారెడ్డి బాలాజీ నగర్‌లోని రిషి హైస్కూల్‌కు చెందిన ముస్కాన్, నిషితా వర్షిణి, లహరి, భవానీలు 10/10 జీపీఏ సాధించారు. వీరితో పాటు ఆరుగురు విద్యార్థులు 9.8 జీపీఏ, ఐదుగురు విద్యార్థులు 9.7 జీపీఏ, ఇద్దరు 9.5 జీపీఏ, ఐదుగురు 9.3 జీపీఏ, ఆరుగురు 9.2 జీపీఏ, మరో ఆరుగురు 9.0 జీపీఏ సాధించగా, మొత్తానికి 99.5 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పి.లక్ష్మీరెడ్డి అభినందించారు.

● సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి విద్యానగర్‌లోని శ్రీసాయికృష్ణ హైస్కూల్‌కు చెందిన పి.శివచంద్రహాస్, ఎండీ అహ్మద్‌అలీలు 9.8 జీపీఏ సాధించారు. స్కూలులో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

● సంగారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌కు చెందిన 8మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించగా, నలుగురు 9.8 జీపీఏ సాధించారు. కరస్పాండెంట్ కె.ఆంథోనీరెడ్డి వారిని అభినందించారు.

● సంగారెడ్డిలోని విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలకు చెందిన 18 మంది 10/10 జీపీఏ సాధించగా, 19 మంది 9.8జీపీఏ, 110 మంది విద్యార్థులు 9.0 జీపీఏ సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఇ.ఆంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీల అభినందించారు.

● **మునిపల్లి:** పదో తరగతి ఫలితాల్లో మండలంలో విద్యార్థులు ప్రతిభ కనబర్చి 99.75ఉత్తీర్ణత సాధించారు. మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి రామ్‌శ్రీజ, కంకోల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి దినేష్, ఖమ్మంపల్లి జడ్‌పీహెచ్ఎస్ విద్యార్థి అక్షయ, లింగంపల్లి గురుకుల పాఠశాలకు చెందిన సిద్ధార్థ 10/10 జీపీఏ సాధించినట్లు ఎంఈవో దశరథ్ తెలిపారు.

● **కొండాపూర్:** మండలంలోని తొగర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకరు, మల్కాపూర్ ప్రైవేటు అక్షర స్కూల్లో నలుగురు విద్యార్థులకు 10/10 జీపీఏ సాధించారు. మండలంలో 15 పాఠశాలలకు గాను 11 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో భీంసింగ్ తెలిపారు.

● **కంది:** మండలపరిధిలోని చేర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో ఐదుగురు 9.8 జీపీఏ సాధించారు.

● **వట్‌పల్లి:** మండలంలో అయా పాఠశాలల నుంచి 100 ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కృష్ణ తెలిపారు. దేవునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సింధూజ 10జీపీఏ సాధించారు.

● **హత్నూర:** మండలంలోని గుండ్లమాచనూర్ మోడల్ స్కూల్ నుంచి వంద శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఇద్దరు విద్యార్థులు సహస్ర వర్షిని, చంద్రిక 10జీపీఏ సాధించారు.

● **రామచంద్రాపురం:** మండలంలోని జడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్, కొల్లూర్, ఈదుల నాగులపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ వెలిమెల, కేజీబీవీ, ఎంజేపీ ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కాగ బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాలల్లో 95శాతం, 93శాతం సాధించారని ఎంఈవో జెమినికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

● **జిన్నారం:** మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 91శాతం ఉత్తీర్ణత సాధించారు. జిన్నారంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మోడల్ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత పొందారని ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు.

● **కల్హేర్:** కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కల్హేర్ మండలంలోని కల్హేర్, మార్డి, క్రిష్ణాపూర్, బీబీపేట్, మాసన్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, మార్డి పాఠశాలలో బుడాల వర్ష 10/10 జీపీఏ సాధించింది. సిర్గాపూర్ మండలంలోని సిర్గాపూర్ ఉన్నత, సిర్గాపూర్ కేజీబీవీ, సిర్గాపూర్ గిరిజన గురుకులం, నల్లవాగు సాంఘిక సంక్షేమ శాఖ గురుకులం, కడ్పల్ ఉన్నత పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించగా వాసర్ పాఠశాలలో మాత్రం 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి కల్హేర్ మండలం, నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు 10/10 జీపీఏ సాధించారు.

● **నారాయణఖేడ్:** మండలంలోని సంజీవన్‌రావుపేట, అబ్బెంద, ర్యాకల్, ఖేడ్‌మైనార్టీ గురుకులం, ఖేడ్ ఎస్టీగురుకులం, అనంత్‌సాగర్, ర్యాలమడుగు, బాచేపల్లి నాగ్‌ధర్ పాఠశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

● **మనూరు:** మనూరుమండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతలో సాధించారు. బోరంచ పాఠశాల నుంచి సీహెచ్ మధురవాణి, పుల్కూర్తి కస్తూర్బాగాంధీ పాఠశాల నుంచి ఆర్.నిఖిత, మూరు నుంచి బి.మహేశ్వరి, బెల్లాపూర్ పాఠశాల నుంచి వరలక్ష్మి 10/10 జీపీఏ సాధించారు.

కంగ్టి: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఎంఈవో శంకర్ తెలిపారు. కంగ్టి ఉన్నత పాఠశాల, తడ్కల్ ఉర్దూ మీడియం, కంగ్టి ఎస్టీ గురుకులంలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్టీగురుకులంలో ఆరుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించగా జడ్పీహెచ్ఎస్ తడ్కల్‌లో ముగ్గురు విద్యార్థులు 9.7 జీపీఏ సాధించారు. కంగ్టి ఉన్నతపాఠశాలలో 5 మంది, కేజీబీవీలో ఇద్దరు విద్యార్థులు 9.5 జీపీఏ సాధించారు.

● **నాగల్‌గిద్ద:** నాగల్‌గిద్ద జడ్పీఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని జడ్పీపాఠశాల కారముంగి, కరస్‌గుత్తి, మోర్గి మోడల్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆయాపాఠశాలలప్రధానోపాధ్యాయులు తెలిపారు.

● **కోహీర్:** 10వ తరగతి ఫలితాల్లో కోహీర్ మండల విద్యార్థులు 98.23 ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి శంకర్ తెలిపారు. దిగ్వాల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులానికి చెందిన నలుగురు 10/10 జీపీఏ సాధించారు. దిగ్వాల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాకు చెందిన ఇద్దరితో పాటు తెలంగాణ గురుకుల పాఠశాల చదివిన మరో ఇద్దరు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. మైనారిటీ గురుకుల విద్యార్థి 10/10 జీపీఏ సాధించాడు.

● **జహీరాబాద్:** పది పరీక్షా ఫలితాల్లో జహీరాబాద్ మండలంలో 96.71శాతం, మొగుడంపల్లి మండల విద్యార్థులు 99.56 శాతం ఉత్తీర్ణత సాధించారు. హుగ్గెల్లి, బూచనెల్లి, అల్గోల్, సత్వార్, రంజోల్,షెకాపూర్, గర్ల్‌హైస్కూల్ (జహీరాబాద్), మొగుడంపల్లి, జాడీమల్కాపూర్, ధనసిరి, గిరిజనగురుకుల పాఠశాల(మొగుడంపల్లి), చిన్నహైదరాబాద్ బాలికల గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమశాఖ రంజోల్ గురుకుల పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి. రంజోల్ గురుకుల పాఠశాలలో ఇద్దరు 10 జీపీఏ సాధించారు. అలాగే చిన్నహైదరాబాద్‌లో గల బాలికల గురుకుల పాఠశాలలో స్రవంతి, మీనాక్షి అనే ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు

● **న్యాల్‌కల్:** మండలానికి చెందిన విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎండీ సద్దాం 9.8 జీపీఏసాధించారు. జడ్పీహెచ్ఎస్ మెటల్‌కుంటలో చదివిన ఆఫియా బేగం 9.8 జీపీఏ సాధించినట్టు మండల విద్యాధికారి తెలిపారు.

● **ఝరాసంగం:** మండలంలోని ఝరాసంగం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, మహాత్మా జ్యోతిబాపూలే, ఆదర్శ పాఠశాలతో పాటు మండల పరిధిలోని కుప్పానగర్, జీర్లపల్లి. ఈదులపల్లి, ఏల్గోయి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 97.38 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయంలో నలుగురు విద్యార్థినులకు 10జీపీఏ వచ్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమపథకాలు గోవిందా



కౌడిపల్లి: కుకుట్లపల్లిలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి

కౌడిపల్లి, ఏప్రిల్ 30: కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే ఉన్న పథకాలు గోవిందా అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లి, బిట్లా తండా, కూకుట్లపల్లి, దేవులపల్లి, బుజరంపేట్‌లో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలిచిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. వెంట మండల పార్టీ అధ్యక్షులు సార రామగౌడ్, ఎంపీపీ రాజునాయక్, నాయకులు ఉన్నారు.

● **హత్నూర:** బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు మంగళవారం మండలంలోని సిరిపురం, తెల్లరాళ్ల తండా, గోవింద్రాజ్‌పల్లి, చీక్‌మద్దూర్, లింగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించాయి. కార్యక్రమంలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరపున మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ హన్మంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● **చేగుంట:** నార్సింగి మండల పరిధిలోని జప్తి శివనూర్, నార్సింగి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా నార్సింగ్ మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి హామీ కూలీ పనులు వద్ద ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామారెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో ఎంపీపీ సబిత, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ సుజాత నాయకులు తదితరులున్నారు.

● **మనోహరాబాద్:** మండలంలోని వెంకటపూర్(అగ్రహారం) గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు పురం మహేష్ ఆధ్వర్యంలో జడ్పీ చైర్‌పర్సన్ భర్త శేఖర్ గౌడ్, నాయకులు ప్రచారం చేశారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31 వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నారు. జిల్లాలోని అందోల్ మండలం అక్సాన్‌పల్లి మోడల్ హైస్కూల్‌లో కబడ్డీ, అందోల్ జడ్పీహెచ్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, పోసానిపేటలో తైక్వాండో, కొండాపూర్ మండలం గంగారం జడ్పీహెచ్ఎస్‌లో యోగా, పటాన్‌చెరు మండలం లక్డారం జడ్పీహెచ్ఎస్‌లో బాక్సింగ్, అమీన్‌పూర్‌లో క్రికెట్, సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో చెస్, కొత్లాపూర్‌లో ఫుట్‌బాల్, చింతల్‌పల్లి పయనీర్స్ స్కూల్‌లో హ్యాండ్ బాల్, రాజీవ్‌పార్క్‌లో తైక్వాండో కంది మండలం ఓడీఎఫ్ సారత్ స్టేడియంలో అథ్లెటిక్స్ శిబిరాలు జరగనున్నాయి. ఆసక్తి కలిగిన క్రీడాకారులు హాజరై శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాంచందర్‌రావు తెలిపారు.

మెదక్ బీజేపీ అభ్యర్థి తరపున గ్రామాల్లో ప్రచారం



చేగుంట: చిన్న శివునూర్ ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట, ఏప్రిల్ 30: మండల పరిధిలోని చిన్న శివునూర్ గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మంగళవారం ఉపాధి హామీ కూలీలకు మద్దతుగా పనులు చేస్తూ ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూలీలకు వివరించారు. ఈ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావుని గెలిపించాలని కూలీలను కోరారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు చింతల భూపాల్, అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాక ఎస్ఎన్ చారి, అసెంబ్లీ కో కన్వీనర్ చిలకమర్రి గోవింద్, మాజీ ఏఎంసీ చైర్మన్ సుజాత, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు కరణం గణేష్ నాయకులు పాల్గొన్నారు.


● **చిన్నశంకరంపేట:** బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును ఆశీర్వదించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు కోరారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్న శంకరంపేటలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనిపించే అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినవే అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** వెల్దుర్తి 33వ బూత్ అధ్యక్షుడు, బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం 250 ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహులుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, కమలం గుర్తుకు ఓటు వేసి రఘునందన్‌రావు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, నవీన్, ప్రశాంత్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.300 వేతనం లభించేలా పనిచేయాలి

తూప్రాన్, ఏప్రిల్ 30: ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస వేతనం రూ. 300లు దక్కేలా పనిచేయించాలని సీఆర్డీ స్పెషల్ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మండలం నాగులపలి, యావాపూర్ గ్రామాలలో నర్సరీలను పరిశీలించి, నాగులపల్లి లక్ష్మిదేవీకుంట పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. నర్సరీలలో పెద్ద మొక్కలకు ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ బాలయ్య, క్వాలిటీ కంట్రోలర్ రమాకాంత్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పటాన్‌చెరులో మే 8న కేసీఆర్ రోడ్‌షో



పటాన్‌చెరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం/గుమ్మడిదల , ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 8వ తేదీన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పటాన్‌చెరులో భారీ రోడ్‌షో నిర్వహిస్తారని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి తెలిపారు. రోడ్‌షోకు భారీగా జన సమీకరణ కోసం మంగళవారం పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలకేంద్రాల్లో వేర్వేరుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా మే 8, సాయంత్రం 6గంటలకు పటాన్‌చెరు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించే రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో 30 పోలీసు చట్టం

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 30: మే 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆందోళనా కార్యక్రమాలు చేయరాదని సూచించారు. ఒకవేళ అనుమతి లేకుండా ఎవరైనా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా ప్రాథమిక శిక్షణలో భాగంగా జిల్లాకు కేటాయించిన శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ ఆయనకు జిల్లా పోలీసు అడ్మినిస్ట్రేషన్ గురించి వివరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఐటి సెల్ పనితీరు గురించి వివరించారు.